నిరుద్యోగులకు హామీలు నెరవేరేదెన్నడో?

- నిరుద్యోగ భృతిపై నోరుమెదపని సర్కారు
- సైలెంట్‌గా వలంటీర్ల తొలగింపు

పాలకొల్లు సెంట్రల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు పూర్తికావస్తున్నా నిరుద్యోగులకు ఇస్తామన్న హామీలు మాత్రం నెరవేర్చలేక పోయింది. జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పినా ఆ ఊసే ఎత్తడంత లేదు. నిరుద్యోగభృతితో పాటు డీఎస్సీ నోటిఫికేషన్లపై మాట్లాడడం లేదని యువత మండిపడుతున్నారు. 16 వేలు డిఎస్సీ పోస్టులు ప్రకటించి ఇంతవరకూ షెడ్యూల్ విడుదల చేయకుండా నిరుద్యోగులతో దోబూచులాడుతున్నారు. ఉద్యోగ కల్పన కల్పించేవరకూ నిరుద్యోగభృతి కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలా దీనిని కూడా అటకెక్కించేలా కనిపిస్తుంది. 2014 ఎన్నికల్లో నిరుద్యోగ భృతి రెండు వేలు ఇస్తామని చెప్పిన నాటి చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఆ విషయాన్నే మర్చిపోయింది. నాడు నిరుద్యోగభృతి అమలుపై ప్రతిపక్షాలు గొంతెత్తడంతో చేసేది లేక 2019 ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హడావుడిగా నిరుద్యోగభృతి వెయ్యి రూపాయలు ప్రకటించి రెండు, మూడు నెలలు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. దానితో నేటి నిరుద్యోగ యువతరం నాడు చేసినట్లే నేడు చేస్తారేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లకు మొండిచేయి

ఇటీవల ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పేరుతో నాడు పాలకొల్లు నియోజకవర్గంలో సూపర్ సిక్స్ పేరుతో నీకు పదిహేను, నీకు పదిహేను, నీకు పద్దెనిమిది వేలు ఇదిగో ఈ చిన్నపాపకు కూడా పదిహేను వేలు వర్తిస్తుందంటూ రాష్ట్రస్థాయిలోనే గుర్తింపు పొందిన నేటి జలవనరుల శాఖా మంత్రి ఆ ఊసే ఎత్తడం లేదు. వలంటీర్లుగా సేవలందిస్తున్న మీకు ఐదు వేలు జీతమా? ఏం సరిపోతుంది? మీరు ఎవరూ రాజీనామాలు చేయకండి అదే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వలంటీర్లకు పది వేలు చేస్తామని చెప్పి ఎన్నికల్లో లబ్ధిపొందిన మహానుభావులు ఉన్న ఆ వలంటీర్ ఉద్యోగాలను సైతం పీకి పక్కనపెట్టారు. నేడు అసలు వలంటీర్ల ఊసే ఎత్తడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇస్తానన్న పది వేలు హామీ దేవుడెరుగు ఉన్న ఐదువేలు కూడా లేకుండా చేశారని వలంటీర్లు వాపోతున్నారు.


పింఛన్ లబ్ధిదారుడికి ఆస్పత్రిలో పింఛన్ ఇస్తున్న వలంటీర్లు (ఫైల్)

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. ఉద్యోగం కల్పించే వరకూ నిరుద్యోగభృతి రూ. 3 వేలు ఇస్తామని హామి ఇచ్చారు. ఇంతవరకూ ఉద్యోగం లేదు..భృతి లేదు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చాలి.

– సీహెచ్. సుందర్, ఏఐఎస్ఎఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, పాలకొల్లు

వలంటీర్లను పక్కన పెట్టేశారు



బి.ఏ చదివుకున్నాను ఏ ఉద్యోగం లేకపోతే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన వలంటీర్ ఉద్యోగం కొంత ఊరటనిచ్చింది. నెలకు ఐదు వేలు జీతం వచ్చేది. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం నాయకులు మీకు ఐదు వేలు ఏమిసరిపోతుంది. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు పది వేలు జీతం ఇస్తామని హామి ఇచ్చారు. కాని నేడు ఉన్న ఆ వలంటీర్ పోస్టులు కూడా అటకెక్కించారు.

– పాలపర్తి సందీప్ కుమార్, బి.ఏ, ఏనుగువాని లంక,

క్లుప్తంగా

విద్యార్థికి ఆర్థిక సాయం


విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తున్న కాపు క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో ఓ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం పట్టణానికి చెందిన విద్యార్థి అల్లు వినయ్‌కుమార్‌కు విద్య నిమిత్తం రూ. 9 వేలు ఆర్థిక సహాయం అందించినట్లు క్లబ్ అధ్యక్షులు జిక్కంపూడి మధన్ తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కాపు క్లబ్ తమ సహాయ సహకారాలు అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు, సెక్రటరీ వేరుకొండ దుర్గాప్రసాద్, జిక్కంపూడి కుమార్, కానూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

నన్నయ్య యూనివర్సిటీ వీసీని కలసిన చాంబర్స్ సభ్యులు


వీసీ ప్రసన్నశ్రీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న చాంబర్స్ కళాశాల సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ చాంబర్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సభ్యులు ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.ప్రసన్న శ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని యూనివర్శిటీలో వీసీను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం కళాశాలకు సంబంధించిన అంశాలపై చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు, సెక్రటరీ కేవీ సీతారామరాజు, అకడమిక్ అడ్వైజర్ ఏబీఎస్ మూర్తి, ఎన్.సీతారామారావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

28న కౌన్సిల్ సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈ నెల 28వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. అజెండాలోని అంశాలతో పాటుగా వార్డుల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులు విధిగా హాజరుకావాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణీకుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ డయల్‌యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డీఎం ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రవాణా సేవలు, కార్గో సేవలు, బస్సు సిబ్బంది ప్రవర్తనకు సంబంధించి సూచనలు, ఫిర్యాదులు తెలియజేయాలని కోరారు. 99692 25486 నంబర్‌కు ఫోన్ చేసి సూచనలు, సమస్యలను తెలపాలని వివరించారు.

రాష్ట్రస్థాయి ఉగాది కవితల పోటీలు

పెనుగొండ: ఉగాది సందర్భంగా చివటం సంగీత సాహిత్య కళావేదిక ద్వారా రాష్ట్రస్థాయి కవితల పోటీలునిర్వహిస్తున్నట్లు ప్రముఖ రచయిత్రి గుండాల గీతామహాలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, రెండు ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. న్నారు. రచయితలకు నచ్చిన ఏదైనా సామాజిక అంశం తెల్ల కాగితం పై 25 లైన్లు మించకుండా రాసి, విడిగా హామీ పత్రంతో పాటు అడ్రస్సు ఫోన్ నెంబర్ తప్పనిసరిగా రాసి పంపాలని, గతంలో ప్రచురణ అయిన కవితలు పంపరాదని తెలిపారు. కవితలు వచ్చేనెల 25 లోపు పోస్ట్ ద్వారా చివటం సుబ్బారావు, జేపీఎల్ నగర్ పెనుగొండ అడ్రస్‌కు పంపాలని కోరారు. మరిన్ని 98495 28590 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మహిళ కడుపులో నుంచి ఏడు కిలోల కణితి తొలగింపు


మహిళ కడుపులోంచి తొలగించిన కణితితో వైద్యులు

నరసాపురం: సాధారణ కడుపునొప్పితో వైద్యం కోసం వచ్చిన ఓ మహిళ కడుపులోంచి మంగళవారం ఆపరేషన్ చేసి 7 కిలోల కణితి నరసాపురం సీతాశ్రీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు తొలగించారు. దీనికి సంబంధించి ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ అద్దంకి విజ్ఞాని తెలిపిన వివరాల ప్రకారం మండంలలోని సారవ గ్రామానికి చెందిన 48 ఏళ్ల మల్లుల భారతి అనే మహిళ వారం రోజుల క్రితం కడుపునొప్పి, ఫీమోషన్ కావపోవడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చింది. అయితే ఆమెను పరీక్షించిన గైనిక్ డాక్టర్ విజ్ఞాని అవసరమైన అదనపు పరీక్షలు చేయించి ఆమె కడుపులో కణితి ఉన్నట్టు గుర్తించారు. భర్త సర్జన్ డాక్టర్ శివరామకృష్ణతో కలిసి ఆపరేషన్ నిర్వహించి 6.80 కిలోల కణితి తొలగించారు. భారతి ఆరోగ్య పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిందని, ఇలాంటి కేసులు అరుదుగా చూస్తామని డాక్టర్ విజ్ఞాని తెలిపారు.

రోడ్డు ఇలా..ప్రయాణమెలా?


పెనుమర్రు-కట్టుపాలెం రోడ్డు దుస్థితి


రాళ్లు లేచిన పెనుమర్రు-మేడపాడు రోడ్డుపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

- అధ్వానంగా పెనుమర్రు రోడ్లు

యలమంచిలి: సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులు నిర్మిస్తామని కూటమి నాయకులు అధికారంలోనికి వచ్చిన వెంటనే ప్రకటనలు చేయడంతో గ్రామీణ ప్రజలు రోడ్లు బాగుపడతాయని ఆశపడ్డారు. తీరా సంక్రాంతి వెళ్లి శివరాత్రి వచ్చినా తట్ట కంకర కూడా వేయని అనేక గ్రామీణ రహదారులు కూటమి నాయకులు బీరాల పలుకులను ఎత్తి చూపుతున్నాయి. మండలంలోని మైనర్ గ్రామాలలో పెనుమర్రు ఒకటి. ఈ గ్రామానికి వచ్చే తారు రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ రోడ్డుపై ప్రయాణం చేయలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దీంతో గ్రామానికి కొత్త రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పెనుమర్రు గ్రామంలో సుమారు 500 ఇళ్లు, 2200 మంది జనాభా ఉన్నారు. కొన్నేళ్ల నుంచి తారు రోడ్డు పాడవ్వడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకొల్లు-దొడ్డిపట్ల ఆర్అండ్‌బీ రోడ్డుకు సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంటుంది. గ్రామానికి రావడానికి రెండు ప్రధాన రహదారులు ఉంటాయి. ఒక రోడ్డు మేడపాడు, మరొక రోడ్డు కట్టుపాలెం వద్ద పాలకొల్లు-దొడ్డిపట్ల రోడ్డుకు చేరుకుంటాయి. మైనర్ గ్రామం కావడంతో ఏ చిన్న పని పడినా అటు మేడపాడు లేదా ఇటు కట్టుపాలెం రావలసి ఉంటుంది. ఈ రెండు రోడ్లు కూడా పూర్తిగా ధ్వంసమయ్యాయి. రోడ్డపై కంకర తేలి ఉండడంతో వాహనాల మీదనే కాదు కనీసం నడవాలన్నా కూడా చాలా కష్టంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ఏ చిన్న పనిపడినా మేడపాడు వరకు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి ఆటోలు, బస్సుల్లో వెళ్లాల్సి ఉంటుంది.

ఇబ్బందులుపడుతున్న విద్యార్థులు

గ్రామంలో ఏడవ తరగతి వరకు మాత్రమే పాఠశాల ఉంది. ఉన్నత విద్య కోసం నిత్యం 60 మంది విద్యార్థులు మేడపాడు, శిరగాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సైకిళ్లపై వస్తుంటారు. ఈ రెండు పాఠశాలలు గ్రామానికి నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. రోడ్డు రాళ్లు లేచి ఉండడంతో సైకిల్ పై రావడం చాలా కష్టంగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైకిల్ తొక్కడం రాకపోతే స్కూళ్లకు పోవడం మానేయాల్సి వస్తుందని తల్లిదండ్రులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మరొక 20 మంది కళాశాలలకు పాలకొల్లు వెళ్తుంటారు. ఈ రోడ్డులో రాత్రి పూట, వర్షా కాలంలో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డు మంజూరుతో పాటు బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ వల్లే..



నేను సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించే నాటికే రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో మండల పరిషత్, పంచాయతీ నిధులు రూ.4 లక్షలు వెచ్చించి రోడ్డు మరమ్మతులు చేశాము. గత ప్రభుత్వంలో కొత్త రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. నాబార్డులో రూ.1.10 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ దశకు వచ్చే సరికి ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదు.

– కవురు గోపి, సర్పంచ్, పెనుమర్రు

ఆర్టీసీ బస్సు నడపాలి



మా గ్రామం నుంచి ప్రతి రోజు 60 మంది వరకు హైస్కూల్, కాలేజీలకు వెళ్తుంటాం. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో సైకిల్ మీద ప్రభుత్వ పాఠశాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. మా గ్రామానికి వివిధ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులు నిత్యం పది వరకు వస్తున్నాయి. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఒక ఆర్టీసీ బస్సు నడిపాలి.

– పెచ్చెట్టి సత్యజ్యోతి, ఇంటర్ విద్యార్థిని, పెనుమర్రు

వైభవంగా పార్వతీ సోమేశ్వరుని కల్యాణం


జుత్తిగలో ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన జుత్తిగ గ్రామంలోని శ్రీఉమా వాసుకి రవి సోమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవం మంగళవారం తెల్లవారు జామున ఘనంగా నిర్వహించారు. వంశం పారంపర్య ధర్మకర్తలు కుటుంబ సభ్యులైన సత్తిరాజు నరసింహరావు, రాధాలక్ష్మి దంపతులతో వేదపండితులు వేమూరి వెంకటేశ్వరశర్మ బ్రహ్మత్వంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం సోమేశ్వర స్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారిని పుష్పకంపై ఉంచి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.


ఆచంటేశ్వరుని కల్యాణం చేస్తున్న అర్చకులు

వేడుకగా ఆచంటేశ్వరుని కల్యాణం

పెనుగొండ: మహాశివరాత్రి సందర్భంగా ఆచంట రామేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం వేడుకగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున పార్వతీ, రామేశ్వర సస్వామి కల్యాణం శంకర మంచి ఉమామహేశ్వరరావుఆధ్వర్యంలో గొడవర్తి కృష్ణకుమార్, ఉషారాణి దంపతులు, వల్లూరి ప్రత్యేషకృష్ణ చైతన్యలు కనుల పండుగగా కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కల్యాణోత్సం అనంతరం స్వామి గ్రామోత్సవ వైభవంగా నిర్వహించారు.

ఐదు రోజులు అన్న సమారాధన

పెనుగొండ: ఆచంటలోని ఆచంటేశ్వరుని ఆలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా మంగళవారం అన్న సమారాధన ప్రారంభించారు. ఐదు రోజుల పాటు భారీ అన్నసమారాధన జరగనుంది. 1936 నుంచి సుమారు 89 సంవత్సరాలుగా మహాశివరాత్రికి ఐదు రోజుల పాటు అన్నసమారాధన నిర్వహిస్తూ వస్తున్నారు. సుమారు 60 వేలకు పైగా భక్తులు అన్నప్రసాదం స్వీకరిస్తారు. దీనికి తగ్గట్టుగా కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

నరసాపురం రూరల్: మండలంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గా లక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను జిల్లాఎస్పీ నయీమ్ అస్మి మంగళవారం పరిశీలించారు. క్యూలైన్ లు ఇతర సదుపాయాలు. ఆలయ ప్రాంగణం, రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేపట్టాల్సిన పనులను డీఎస్పీ శ్రీవేద తదితరులతో కలసి పరిశీలించారు. ఎస్పీ వెంట సీఐ దుర్గా ప్రసాద్ ఉన్నారు.

నేడు సిద్ధాంతంలో ప్రభ సంబరం

పెనుగొండ: మహా శివరాత్రి సందర్భంగా సిద్ధాంతం సాలిపేటలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి వారి సూలాల సంబరం, ప్రభ సంబరం బుధవారం రాత్రి వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఖండవల్లి వారి కూచిపూడి జానపద నృత్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మార్చి 2న భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

వివిధ శివాలయాలలో ప్రత్యేక ఏర్పాట్లు

పెనుగొండ మండలంలో సుప్రసిద్ధ శ్రీ నగరేశ్వర మహిషాసుర మర్ధని వాసవి అమ్మవారి ఆలయంలోనూ, చెరుకువాడ ఉమా విశ్వేశ్వర స్వామి వారి ఆలయం, సిద్ధాంతం నందీశ్వర స్వామి వారి దేవాలయం, వశిష్ఠ గోదావరి వద్ద కేదారేశ్వర స్వామి వారి ఆలయం వద్ద, అలాగే ఇలపర్రులోని నీల కంఠేశ్వర స్వామి వారి ఆలయం వద్ద, వడలి శ్రీ అగస్తేశ్వర స్వామి వారి ఆలయాల వద్ద దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

పెనుమంట్ర: మండలంలోని నత్తారామేశ్వరం గ్రామంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కల్యాణం తీర్ధ మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం తెల్లవారు జామున శ్రీరామేశ్వరస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవీరభద్రస్వామి, శ్రీలక్ష్మణేశ్వరస్వామివారికి తూర్పుగోదావరి జిల్లా మాచవరానికి చెందిన వేదపండితులు విలపర్తి కామేశ్వర శర్మ ఆలయ అర్చకులు ఆర్ రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రసవా భారతీయుడు తాతకుంట్ల ఎల్లారీశ్వరరావు, వసుంధరా దేవి దంపతులతో స్వామివార్లకు కల్యాణం నిర్వహించనున్నారు. అనంతరం గోస్తనీలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుష్కరిణి స్నానఘట్టంలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివార్లను క్యూలైన్లలో ఉండి దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. లక్ష్మణేశ్వర ఆలయ ఆవరణలో దాతల సహకారంతో అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసారు. అన్న సమారాధన, దర్శన క్యూల్లో భక్తుల చెప్పులు, సామాన్లు భద్రపరిచే సేవలకు గాను 250 మందికి పైగా సత్యసాయి సేవా వలంటీర్లు సేవలుచేయడానికి సిద్ధంగా ఉన్నారు. మధ్యాహ్నం రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ, ఇద్దరు ఎస్సైలతో పాటు 30 మందిపోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై కె.స్వామి తెలిపారు. ఆలయ ఆవరణలో పెనుమంట్ర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 40 మంది మెడికల్ సిబ్బంది రెండు ప్రత్యేక మెడికల్‌క్యాంపులను నిర్వహిస్తున్నారు.


నత్తారామేశ్వరంలో లక్ష్మణేశ్వర ఆలయం వద్ద దాతల సహకారంతో ఏర్పాటు చేసే అఖండ అన్నసమారాధన శిబిరం


జిన్నూరులో అన్నపూర్ణేశ్వరి ఆలయం వద్ద భారీ అన్నసంతర్పణకు వేసిన చలువపందిరి

జిన్నూరులో..

పోడూరు: జిన్నూరులో శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆలయం వద్ద ప్రతీఏటా శివరాత్రి వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా శివరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు నిర్వహించారు. వేకువజాము నుంచే ఆలయంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరుపనున్నారు. దాదాపు 10 వేల మంది భక్తులకు భారీస్థాయిలో అన్నసంతర్పణ కార్యక్రమం జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయకమిటీ ఛైర్మన్ జమ్ము మృత్యుంజయరావు, కమిటీ సభ్యులు, నవయువత యూత్ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.